గొడిసిర్యాల శివాలయాన్ని సందర్శించిన డీఎస్పీ

నవతెలంగాణ-దస్తురాబాద్

మండలంలోని గొడిసిర్యాల గ్రామ శివాలయాన్ని బుధవారం డిఎస్పి గంగారెడ్డి, ఖానాపూర్ సిఐ మోహన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న మహాశివరాత్రిని పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం ఆలయంలో గల పరిసరాలను పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అయన వెంట ఎస్సై యాసిర్ అర్ఫత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



మట్కా ఆడుతున్న వ్యక్తిపై కేసు

నవతెలంగాణ - కాగజ్‌నగర్

పట్టణంలోని ఇర్ఫాన్‌నగర్ కాలనీకి చెందిన షేక్ రియాజ్ బుధవారం మట్కా ఆడుతుండగా పట్టుకున్నట్టు కాగజ్‌నగర్ టౌన్ ఎస్సై కళ్యాణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... తమకు అందిన పక్కా సమాచారం మేరకు ఇర్ఫాన్‌నగర్‌లో తనిఖీలు చేపట్టారు. షేక్ రియాజ్ మట్కా ఆడుతూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుండి మట్కాకు సంబంధించిన చిట్టీలు, ఒక సెల్ ఫోన్, రూ.1230 నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలో మట్కా, జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.



కాంగ్రెస్‌లోకి కోనప్ప..!

- బీఎస్పీతో పొత్తుపై అసంతృప్తి..సీఎంతో భేటీ
- త్వరలోనే హస్తం గూటికి చేరేందుకు రంగం సిద్ధం
- అదే బాటలో ఓ మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే
- నాయకుల వలసలతో బీఆర్ఎస్‌లో ప్రకంపనలు
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తి రేపుతున్న రాజకీయ పరిణామాలు

లోక్‌సభ ఎన్నికల వేళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారుతున్నాయి. పలువురు ముఖ్య నాయకులు పార్టీలు మారడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. తాజాగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బుధవారం హైదరాబాదులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. బీఆర్ఎస్‌తో బీఎస్పీ పొత్తు పెట్టుకుంటుందనే ప్రచారం నేపథ్యంలో అసంతృప్తికి గురైన కోనప్ప కాంగ్రెస్ గూటికి చేరేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలోనే ముహూర్తం చూసుకొని కాంగ్రెస్ కండువా కప్పుకొంటారనే ప్రచారం జరుగుతోంది. మరోపక్క అదే బాటలో ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్‌కు చెందిన ఓ మాజీ మంత్రితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే సైతం ఆ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందుగానే ఈ పరిణాలు చోటుచేసుకుంటాయని తెలుస్తోంది. ఇప్పటికే పలువురు కీలక నాయకులు పార్టీ వీడటం.. మరింత మంది ముఖ్య నాయకులు బీఆర్ఎస్‌ను వీడుతుండటంతో ఆ పార్టీలో ప్రకంపనలు రేగుతున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, కోనేరు కృష్ణారావు, ఇతర నాయకులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవంతో ఖంగుతున్న గులాబీ పార్టీని మరిన్ని కష్టాలు వెంటాడుతున్నాయి. ఉద్యమ కాలం నుంచి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల వరకు ఉమ్మడి జిల్లాలో ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ.. రాష్ట్రంలో అధికారం కోల్పోగానే అధపాతాళానికి పడిపోయినట్లు కనిపిస్తోంది. ఇన్నాండ్లు ఆ పార్టీలో కీలకంగా ఉన్న ముఖ్య నాయకులు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతుండటంతో ఆ పార్టీ కష్టకాలాన్ని ఎదుర్కొంటోంది. తాజాగా గత పదేండ్ల పాటు బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేగా కొనసాగిన ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తాజాగా ఆ పార్టీనీ వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్‌లో బీఎస్పీ అభ్యర్థిగా ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ పోటీ చేయడంతో ఓట్లు చీలిపోయి బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన కోనప్ప ఓటమి చెందారని ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడం..రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీఎస్పీ మధ్య పొత్తు ఉంటుందనే ప్రచారం జరగడంతో కోనప్ప అసంతృప్తికి గురైనట్లు తెలుస్తోంది. తన ఓటమికి కారణమైన ఆర్ఎస్‌పీతో మాజీ సీఎం సమావేశం కావడం నచ్చకనే కోనప్ప బీఆర్ఎస్ వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి ఆయన ద్వారా సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయి కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇదే బాటలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రితో పాటు ఓ మాజీ ఎమ్మెల్యే కూడా బీఆర్ఎస్‌ను వీడేందుకు సిద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మరికొన్ని రోజుల్లోనే ఈ పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది.

బీఆర్ఎస్‌లో ప్రకంపనలు..!

అసెంబ్లీ ఎన్నికల వరకు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిండుగా కనిపించిన గులాబీ పార్టీ ఎన్నికల తర్వాత విపత్కర పరిణామాలు ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోవడంతో ముఖ్య నాయకులు, ఆ పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన కార్యకర్తలు వారి రాజకీయ భవిష్యత్తు కోసం హస్తం గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ వెంకటేష్‌నేత, డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి కాంగ్రెస్‌లో చేరిపోగా.. ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మెన్ రాథోడ్ జనార్దన్ బీజేపీలో చేరారు. వీరితో పాలు పలువురు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ముఖ్యంగా ఆదిలాబాద్ లోక్‌సభ సీటును కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలోని కీలక నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తద్వారా లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల నాటిని మరింత నాయకులు బీఆర్ఎస్‌ను వీడుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

డీఈఓ నిర్లక్ష్యంతో డీఎస్సీలో నష్టపోతున్నాం

- కార్యాలయం ఎదుట అభ్యర్థుల ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లా విద్యాశాఖధికారిణి నిర్లక్ష్యం కారణంగా తాము నష్టపోతున్నామని ఉర్దూ అభ్యర్థులు ఆరోపించారు. బుధవారం విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమకు న్యాయం చేయాలంటూ నినదించారు. అనంతరం డీఈఓ ప్రణీతను కలిసి వినతిపత్రం అందించి తమ సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా ఉర్దూ అభ్యర్థి ఫేరోజ్ మాట్లాడుతూ డీఎస్సీలో ఉర్దూ మీడియం పోస్టులు తక్కువ చూపించారన్నారు. ఖాళీలకు అనుగుణంగా గతంలో భర్తీ కాని పోస్టులనే స్థానిక డీఈఓ ఇచ్చారన్నారు. దాని ఆధారంగానే నోటిఫికేషన్‌లో తక్కువ సీట్లు వచ్చాయన్నారు. 221 పోస్టులు అవసరం ఉండగా కేవలం 52 పోస్టులే చూపిస్తున్నారన్నారు. ఇందులో రిజర్వేషన్ కారణంగా కేవలం ముస్లీం మైనార్టీలకు ఏడు పోస్టులే వస్తున్నాయన్నారు. ఖాళీలకు అనుగుణంగా పోస్టులను చూపిస్తు మైనార్టీ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అభ్యర్థులు ఫేరోజ్ అహ్మద్, అబ్రార్ అహ్మద్, మహ్మద్ ఉమర్ అహ్మద్, అబ్దుల్ మునిబ్, ముజాహిద్, అబ్దుల్ మునీర్, జునేద్, సయ్యద్ సిరాజొద్దీన్ పాల్గొన్నారు.

స్కూల్ పిల్లలకు ఉపన్యాస పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని అంకోలి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా స్కూల్ పిల్లలకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి పెన్నులు, పెన్సిళ్లు, బుక్స్ బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నర్సయ్య మాట్లాడారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం, మహిళా సాధికారత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ చంద్రశేఖర్, సిడిపిఓ వనజ, మహిళా సాధికారత అధికారిణి కృష్ణవేణి, సఖి కేంద్రం అధికారిణి లావణ్య, ఐసిడిఎస్ సూపర్వైజర్ నీరజ, మహిత స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ ఆదర్శ్, అంకోలి సెక్టార్ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నస్పూర్

భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య(లియాఫీ 1964) సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన కంకణాల దేవేందర్‌రెడ్డి కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్స్ సంఘం అధ్యక్షులు కె.పూర్ణచందర్, కార్యదర్శి బండి వాసు, కోశాధికారి చుంచు సాగర్, ఉపాధ్యక్షులు ముప్పిడి రవీందర్, ఆర్.సత్యనారాయణరెడ్డి, గుర్రం శ్రీనివాస్, మల్లికార్జున్, ఎం.మధుకర్, చెన్నూర్ ఏజెంట్స్ మిత్రులు పాల్గొన్నారు.

సీఐగా ఫణిందర్ బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ రూరల్ సీఐగా బుధవారం ఫణందర్ బాధ్యతలు చేపట్టారు. మహబూబాబాద్ సీఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. బాధ్యతలు తీసుకున్న సీఐకి పోలీసు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా చూడాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా
- అధికారులతో సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హునికి అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజాపాలన సేవాకేంద్రాల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాలలో ప్రజలు ప్రజాపాలనకు సంబంధించిన దరఖాస్తులను సంబంధిత అధికారులు సేకరించిన డేటాను సక్రమంగా తప్పులు లేకుండా నమోదు చేయాలని తెలిపారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తగినన్ని దరఖాస్తు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. ఇప్పటికే ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా పథకాల కోసం ప్రజల నుంచి తీసుకున్న దరఖాస్తుల వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేయడం జరిగిందని, ఏవైనా తప్పులు నమోదైతె సరిచేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బందికి ప్రజాపాలన సేవాకేంద్రాల పట్ల అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ద్వారా వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అందుకు సంబంధించిన పనులు సత్వరమే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రత్యేక అధికారులను నియమించడం జరుగుతుందని, వారు మండలాల్లో పర్యటించి పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన రెండు గ్యారెంటీలైన రూ. 500 గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంటు లబ్ధిదారులకు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఐటిడిఏ పీఓ ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మెహతో, తహసీల్దార్, ఎంపిడివోలు పాల్గొన్నారు.





ఆదిలాబాద్ కలెక్టర్‌గా రాజర్షి షా బాధ్యతల స్వీకరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా నూతన కలెక్టర్‌గా రాజర్షి షా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ జిల్లా కలెక్టర్‌గా ఐదు రోజుల క్రితం బదిలీ కాగా ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన నేపథ్యంలో ఇక్కడే ఉన్నారు. తాజాగా 2017 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాజర్షి షా మెదక్ జిల్లా నుండి బదిలీపై ఆదిలాబాద్ వచ్చి తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ కుష్బూ గుప్తా, అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహాతో, డీపీఆర్వో తిరుమల, ఆర్డిఓ, స్థానిక రెవెన్యూ అధికారులు సిబ్బంది కొత్త కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్, పదవ తరగతి పరీక్షలతో పాటు పార్లమెంట్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామని తెలిపారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టరేట్ ఉద్యోగులు

నాణ్యమైన విద్య అందించాలి

- మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా : ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రూ.13.50లక్షల పిఎంఎస్‌హెచ్ఆర్ఐ నిధులతో సైన్స్ ల్యాబ్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ దశల వారీగా రూ.2.50కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పదవతరగతి, ఇంటర్మీడియేట్, డిగ్రీ విద్యార్థులతో బోధన కార్యక్రమాలు చేపడుతున్నారని, వీటి ద్వారా నాణ్యమైన విద్య అందే అవకాశం లేదన్నారు. ఉపాధ్యాయ శిక్షణ పొంది కాంపిటీటివ్ పరీక్షల్లో ఉన్నతమైన ర్యాంకు సాధించి ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధించబడుతుందని, ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. డిఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే వ్యక్తి మహేశ్వర్‌రెడ్డి అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులు చదువుతారని, వారికి నాణ్యమైన విద్య అందించాలాని పదే పదే తనకు గుర్తు చేస్తూ ఉంటారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తనకు తరచూ చెబుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడ్వాల పద్మ రమేష్, జడ్పిటిసి ఓస రాజేశ్వర్, పంచాయతీరాజ్ డిఈ రాజేందర్, తహసీల్దార్ జానకి, ఎంపిడిఓ రాంప్రసాద్, ఎంపిటిసి గడ్డం నర్సారెడ్డి, నాయకులు అయిండ్ల భూపాల్‌రెడ్డి, సురకంటి ముత్యంరెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జుంజురు స్వప్న పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, మండలాల తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీఓ యూనియన్ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజర్షి షాను టీఎన్జీఓ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఉద్యోగులందరూ ప్రజా సంక్షేమ పాలనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ యూనియన్ నాయకులకు సూచించారు. అనంతరం పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, నవీన్ కుమార్, నాయకులు తిర్మల్ రెడ్డి, నూర్ సింగ్, ఓం ప్రసాద్, సుజాత, రాధ, చంద్రశేఖర్, రాజేశ్వర్, గంగాధర్, రాజు, తాలూకా కార్యదర్శి అరుణ్, రజినీకాంత్, నవీన్, మహిళ ఉద్యోగులు రజిత, ఆశ జ్యోతి, కృష్ణవేణి, వార్డన్ సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింలు పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభించిన సొసైటీ సభ్యులు

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని కుంటగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాలవాగు గ్రామంలో బుధవారం ఆదివాసీ ప్రజా సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ సభ్యురాలు సోయం కృష్ణవేణి మాట్లాడారు. పాలవాగు గ్రామంలో చదువుకునే పిల్లలున్న గ్రామంలో పాఠశాల లేకపోవడంతో తాత్కాలికంగా పిల్లల చదువు కోసం విద్య వాలింటర్‌ను ఏర్పాటు చేసి, విద్యను అందిస్తున్నారు. 30 మంది పిల్లలున్న గ్రామంలో పాఠశాల లేకపోవడం బాధాకరమన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను, బ్యాగులు,పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అమోల్, సంతోష్, యాదవ్ రావ్, భీంరావ్, సీతారాం పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు వసూలును నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో



నవతెలంగాణ-నిర్మల్

హామీని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు వసూలు చేస్తోందని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌పై మాట తప్పి ప్రజలను మోసం చేస్తోందన్నారు. రూ.20వేల కోట్లు దండుకునేందుకు 25లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఎల్ఎఆర్ఎస్ చేయాలన్నారు. చేసే వరకు పోరాటం ఆగదని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, నాయకులు నాలం శ్రీనివాస్, ధర్మాజీ రాజేందర్, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



నవతెలంగాణ-భైంసా

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని బిజెపి నియోజకవర్గ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. బుధవారం పట్టణంలోని గణేష్‌నగర్ మున్నూరు కాపు సంఘ భవనంలో బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నారిశక్తివందన్ కార్యక్రమంలో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ నుండి ఎస్ఎస్‌జి మహిళా సంఘాలకు, ఎన్జీవోలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యక్రమం ఉండడంతో పార్టీ ఆదేశానుసారం ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళలకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రక్రియ ప్రవేశపెట్టడం బిజెపి ఘనతే అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు ముద్ర రుణాలు, శిశు కిషోర్ యువ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటికి దీపం ఇల్లాలు అని మహిళలు అన్ని రంగాల్లో ముందుంటేనే దేశం పురోగతి సాధిస్తుందని పేర్కొన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, నాయకులు గోపాల్ సర్దా, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, పట్టణ బిజెపి అధ్యక్షులు మల్లేష్, శక్తివందన్ కార్యక్రమ ఇన్‌చార్జి రావుల సువర్ణ పోశెట్టి, కౌన్సిలర్లు అనిత బాలాజీ సూత్రావే, అల్లెం లక్ష్మి, బిజెపి మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, నాయకులు గాలి రవి, దిలీప్, మాణిక్, తూమోల్ల దత్తాత్రి, వడ్నప్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-నిర్మల్

మహాశివరాత్రిని పురస్కరించుకొని వేములవాడకు 30 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దలకు రూ.220, పిల్లలకు రూ.120 చార్జీ ఉంటుందని తెలిపారు. శుక్రవారం రోజు నిర్మల్ పరిసర ప్రాంతాలలో గల ప్రముఖ శైవ క్షేత్రాలు బూరుగుపల్లి, కదిలి, శ్రీరాంసాగర్, కాల్వ పుణ్యక్షేత్రాలకు సైతం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఈ శివరాత్రి ప్రత్యేక బస్సులకు మహాలక్ష్మి స్కీమ్ ద్వారా ఉచిత ప్రయాణం వర్తిస్తుందని, భక్తులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు.

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

దళిత మాల సంఘ భవనం పక్కనగల ఖాళీ స్థలాన్ని సంఘానికి కేటాయించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని దళిత సంఘ నాయకులు బుధవారం ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సంబంధిత డీఈతో మాట్లాడారు. ప్రణాళిక ఇవ్వాలని డీఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో సుధీర్, మహేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 767 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన మొదటి సంవత్సరం పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ కుమార్ పేర్కొన్నారు. ఈ పరీక్షకు 9016 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 8249 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు ఆయన తెలిపారు. 767 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు డీఐఈఓ తెలిపారు.

బాజీరావు సప్తహాలో పాల్గొన్న సుహాసినిరెడ్డి

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మాండగడ గ్రామంలో శ్రీ సద్గురు బాజీరావ్ మహారాజ్ భవ్య జ్ఞానేశ్వరి పారాయణ సప్తహ వేడుకలు ఘనంగా కొనసాగాయి. బుధవారం సప్తహ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సప్తహ కార్యక్రమాలతో గ్రామాలలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ ఉపాధ్యక్షుడు దర్శనాల మల్లేష్
- కాజేసిన నగదును అకౌంట్‌లో జమ చేయాలి
- మున్సిపల్ కమిషనర్‌కు సీఐటీయూ వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో పాటు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్ అన్నారు. బుధవారం తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దర్శనాలు మల్లేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్, ఈఎస్ఐ పేరుతో కట్ చేసిన రూ. కోటి ముప్పై ఆరు లక్షలు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సానిటేషన్ కార్మికులు, డ్రైవర్లు, వాటర్ సప్లయ్ కార్మికులకు రెండునెలలుగా వేతనాలు లేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈపీఎఫ్ ఖాతాలో జమచేయడం లేదన్నారు. 9 నెలలుగా ఇలా దాదాపు రూ.కోటి 36 లక్షలు కార్మికుల ఖాతాలో జమ కావాలిసి ఉన్న ఇప్పటి వరకు జమకాలేదన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం పెంచిన వేతనాలు రూ. 1000 ఇంకా అమలు చేయడం లేదని పెరిగిన వేతనం చెల్లించాలన్నారు. వారాంతపు, పండగా సెలవులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అగ్గిమల్ల స్వామి, దర్శనాల నగేష్, జిల్లా నాయకులు ఆత్మారాం ఎం.జనార్దన్, వెంకటీ, భారత్, మహేందర్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



నార్నూర్

నవతెలంగాణ-నార్నూర్

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని గాదిగూడ సెక్టార్ సూపర్‌వైజర్ ఉమా అన్నారు. బుధవారం గాదిగూడ మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల పెట్టుబడి పురోగతి, ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ కోసం చేపట్టిన మహిళాసాధికారత, భేటీ బచావో భేటీ పడవో పథకం, మహిళా హక్కులు, చట్టాలు, మహిళకు సంబంధించిన పథకాల గురించి జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద అవగాహన కల్పించారు. సఖీ నిర్వహకురాలు సరస్వతి సఖీ సేవలు, గృహ హింస నిరోధక చట్టం, హెల్ప్‌లైన్ నెంబర్స్ 181, 100, 1098, బాలికలపై లింగ సమానత్వం, హింస నిరోధించే దిశగా ఉన్న అంశాలను వివరించారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ప్రదిపిక, లక్ష్మి, వందన, గాదిగుడ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్ : మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని ఆర్టీసీ ఉట్నూర్ డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ రాజయ్య అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఎక్కువ ఆదాయాన్ని లాభం చేకూర్చిన ఇద్దరు మహిళా కండక్టర్లు ఉష, సంగీతలను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ కృష్ణ, వెంకటేష్, కల్పన, అజాం, వంశీ, నారాయణ, మూర్తి, అరవింద్, రవి పాల్గొన్నారు.



ఉట్నూర్

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాల్సిందే : ఎమ్మెల్యే



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నవతెలంగాణ-బోథ్

ఎల్ఆర్ఎస్ పూర్తిగా ఉచితంగా చేయాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అలాగే, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ల పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రంలోని ధర్నా చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాల హామీలకు కేరాఫ్ అడ్రస్ కాంగ్రెస్ పార్టీ మారిందన్నారు. అలాగే రైతులకు రైతు బంధు అందించని ప్రభుత్వనికి రైతులు పార్లమెంటు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారన్నారు. రైతులకు రూ.రెండు లక్షలు రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. గతంలో ఎల్ఆర్ఎస్ వద్దు భూములను ఉచితంగా క్రమబద్దీకరిస్తామన్న కాంగ్రెస్ మాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పుడు అడ్డగోలుగా మాట్లాడిన ఇప్పటి కాంగ్రెస్ మంత్రులు నోరు ఎందుకు తెరవడం లేదన్నారు. ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకున్న 25.44 లక్షల మందిపైన కనీసం లక్ష రూపాయల భారం పడనుందన్నారు. ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ఆర్ఎస్ ద్వారా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించేందుకే కేంద్ర పథకాలు

- డ్వాక్రా మహిళలతో ప్రధానమంత్రి వర్చువల్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి బీజేపీ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. వెస్ట్ బెంగాల్ నుంచి వర్చువల్ ద్వారా డ్వాక్రా మహిళలతో ప్రధాన మంత్రి సమావేశం నిర్వహించారు. బుధవారం స్థానిక ఎస్‌టీయూ భవనంలో స్క్రీన్ ఏర్పాటు చేసి వర్చువల్ విధానాన్ని మహిళలు తిలకచించారు. దీనికి ఎమ్మెల్యే పాయల్ శంకర్, రాష్ట్ర సమన్వయకర్త చిట్యాల సుహాసిని రెడ్డిలు హాజరయ్యారు. ప్రధాని మోదీ ప్రసంగం అనంతరం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను మహిళలు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు అవకాశం ఇస్తే సాధించలేనిది ఏది లేదని భావించి ప్రధాన మంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రాజకీయాల్లో మహిళలు రాణించాలనే ఉద్దేశ్యంలో మహిళ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించారని గుర్తు చేశారు. గత ప్రభుత్వాలు మహిళల గురించి పట్టించుకోలేదని ఆరోపించారు. బీజేపీ హయంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహంతో పాటు రుణాలు కూడా అందిస్తుందన్నారు. సమన్వయ కర్త చిట్యాల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఇచ్చే రుణాల్లో కేంద్ర వాట కూడా ఉందన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వాలు వాటి గురించి తెలియకుండా చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంక్షేమం కోసం కేంద్రం నిధులు ఇస్తే వారి పేరునే చెప్పుకున్నారన్నారు. దాని కారణంగా తెలంగాణలో బీజేపీ అధికారంలోకి లేకపోవడమేనని తెలిపారు. కేంద్ర పథకాలను తెలుసుకుంటూ ప్రతి ఒక్క మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళ నాయకురాళ్లు ధోని జ్యోతి, చిల్కూరి జ్యోతి రెడ్డి, రేఖ, స్వప్న, మయూర్ చంద్ర, బోయర్ విజయ్, అకుల ప్రవీణ్ పాల్గొన్నారు.



ప్రధాన మంత్రి వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని పెండలవాడ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.25 లక్షల నిర్మించనున్న రోడ్డు పనులను బుధవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ పేదవాడు కూడా ఉపాధి లేక పస్తులుండకూడదన్న ఉదేశ్యంతో ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ పనులకు నిధులు కేటాయిస్తూ వారికీ అండగా కేంద్ర ప్రభుత్వం నిలబడుతుందన్నారు. కక్షసాధింపు ఉండదని కేవలం అభివృద్ధియే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఓట్లు వేసిన వేయకున్న ప్రజ సంక్షేమమే పరామవధిగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రాందాస్, అశోక్ రెడ్డి, నరేష్, అశోక్, ఉల్లాస్ రెడ్డి, పవన్, ప్రభాకర్, భూమన్న ముకుంద్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సంఘీభావం



నవతెలంగాణ-కుభీర్

కుభీర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు 6 రోజుల నుంచి చేపడుతున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమ్మెకు బుధవారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జావిద్ ఖాన్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పారిశుధ్య కార్మికులకు 6నెలల వేతనాలు పెండింగ్‌లో ఉంచడం బాధాకరమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూడాలన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు నారాయణరావు పటేల్ కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్షుడు మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విలాస్ పాల్గొన్నారు.

మద్యపాన నిర్మూలనకు సహకరించాలి



నవతెలంగాణ-నార్నూర్

మద్యపాన నిర్మూలనకు సహకరించాలని మండలంలోని తాడిహత్నూర్ గ్రామ పంచాయతీ పరిధిల గ్రామస్తులు కోరారు. నాలుగు రోజుల క్రితం కమిటీ సభ్యులు ఉద్యోగ యూనియన్ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మద్యపాన నిషేదంపై తీర్మానం చేశారు. ఈ సందర్భంగా తీర్మానించినా పత్రాని బుధవారం గ్రామ పెద్దలు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ రవి కిరణ్‌కు అందించారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిర్మూలనకు సహకరించాలని కోరారు. పోలీసుల సహకారంఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. ఇందులో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, గ్రామ యూత్ సభ్యులు, ఉద్యోగ యూనియన్ సభ్యులు చౌహాన్ కిశోర్, జాదవ్ పరుశురాం జాదవ్, పృథ్వీరాజ్, రాథోడ్ దినేష్ పటేల్, గంగాపూర్ మాజీ సర్పంచ్ రూప్‌దేవ్, మాజీ ఉప సర్పంచ్ విష్ణు ఫడ్, జాదవ్ ఆనంద్ రావ్, చౌహాన్ పునిరాం పాల్గొన్నారు.

మెడికల్ షాప్ నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి



నవతెలంగాణ-సిరికొండ

మెడికల్ షాప్ నిర్వాహకులు జాగ్రతలు పాటించాలని డ్రగ్ ఇన్స్‌పెక్టర్ శ్రీలత అన్నారు. బుధవారం మండలం కేంద్రంలోని మెడికల్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. గడువు ముగిసిన మందులను ఎప్పటికప్పుడు తీసివేయాన్నారు. నిషేధిత మందులను విక్రయించవద్దని, పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

ఒత్తిడికి లోనై అసత్య ఆరోపణలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్రవర్ణాల నాయకులు ఉన్నత స్థానంలో ఉండాలనే ఆలోచనతో ఉన్న డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి కాంగ్రెస్‌లోఎలాంటి గుర్తింపు లేక ఒత్తిడికి లోనవుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మాజీ మార్కెట్ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి బాలూరి వ్యాఖ్యలను ఖండించారు. జోగురామన్నకు మాజీ మార్కెట్ చైర్మన్‌లు బామ్మర్దులు అంటూ మాట్లాడటం తగదన్నారు. ఎస్సీ, ఎస్టీ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే మాజీ మంత్రి రామన్న అధ్యక్షతన ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ వ్యక్తులు మార్కెట్ చైర్మన్‌లుగా గుర్తింపు పొందడం జరిగిందన్నారు. ఇది చూసి ఓర్వలేని బాలూరి గోవర్ధన్ రెడ్డి డబ్బులు తీసుకొని పదవులు ఇచ్చారని ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సెవ్వ జగదీష్, బీఆర్ఎస్ నాయకులు కుమ్ర రాజు, ఇజ్జగిరి నారాయణ, రాజన్న, వేణు యాదవ్, పరమేశ్వర్, సతీష్ ఉన్నారు.

నేడు ఉచిత శిక్షణ దరఖాస్తుకు చివరి తేది

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీఎస్పీఎస్సి గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు చేసుకోవాడానికి గురువారం చివరి రోజని బీసీ అభివృద్ధిశాఖ అధికారి రాజలింగు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ డిగ్రీ పాసైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 3వ తేదీ నుంచి 7 వరకు స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఉచిత శిక్షణ 11 నుండి ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. నిపుణులైన అధ్యాపకుల చేత శిక్షణ ఉంటుందని, డైలీ, వారంతపు, పూర్తి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు క్యాస్ట్, ఇన్‌కామ్, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో రావాలన్నారు. అభ్యర్థులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం రూ.5 లక్షలలోపు ఉండాలని, అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని తెలిపారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 08732-221280 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల సర్వసభ్య సమావేశం సభ్యుల కోరం లేకపోవడంతో సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్టు ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. బుధవారం జరగాల్సిన 20వ సాధారణ సర్వసభ్య సమావేశం ఎనిమిది మంది ఎంపీటీసీ సభ్యులకు ఒక ఎంపీటీసీ మాత్రమే హాజరయ్యారు. అన్ని శాఖలకు సంబంధించిన మండలస్థాయి అధికారులు హాజరైనప్పటికీ ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో సమావేశం వాయిదా వేసినట్టు, తిరిగి సమావేశం నిర్వహించే తేదీని తెలియజేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



ఈజ్‌గాం శివమల్లన్న ఆలయంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ల సంఘం నాయకులు కోరారు. ఆలయ కమిటీ సభ్యులు హరిప్రసాద్ సోని, ఏమాజీ శారద సంతోష్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆలయ కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారని సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, సభ్యులు కలికోట రమణయ్య, పురుషోత్తం, రాంప్రసాద్, మార్త రాంబాబు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆఫీస్ బేరర్ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వంగూరు రాములు అతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో కోటి ఇరవై లక్షల మంది కార్మికులు పని చేస్తున్నారని, వీరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. తెలంగాణలోని షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు సంవత్సరాలకొకసారి వేతన సవరణ చేయాల్సి ఉన్నా అమలు చేయకుండా కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటోందని మండిపడ్డారు. 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో కనీస వేతనాల జీఓలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని, తక్కువ వేతనాలు నిర్ణయించి కార్మికుల కడుపులు కొట్టే చర్యలు మానుకోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం ముఖ్యమంత్రిని కలిసి కనీస వేతనాలపై వినతి పత్రాలు ఇచ్చినప్పుడు సానుకూలంగా స్పందింస్తామని హామీ ఇచ్చి, కొత్తగా జారీచేసిన కనీస వేతనాలను పరిశీలిస్తే కొత్త సీసాలో పాత సారా మాదిరిగా ఉందన్నారు. కార్మిక సమస్యల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు తేడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, ఆర్.త్రివేణి, పద్మ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్రంథాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే




నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో రూ. కోటి 50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులను డీఈ శ్రీనివాస్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయ నూతన భవన పనులను వారం రోజులలోగా పూర్తిచేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నిర్మిస్తున్న భవనాన్ని పూర్తిచేసి మిగిలిన నిధులను ఇతర పనులకు వినియోగించాలని సూచించారు. పాఠకులు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమైన పత్రికలు, పాఠ్యపుస్తకాలు, మెటీరియల్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, ఏఈ కిరణ్, లైబ్రేరియన్ సదానందం, గుత్తేదారు అమర్ బీన్ హైమద్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా చేయాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) ఉచితంగా అమలు చేయాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో శ్రేణులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు లే అవుట్ రెగ్యులరైజేషన్ ఉచితంగా చేయాలన్నారు. ప్రజలను దోచుకోవడానికి కొత్త ఎత్తుగడ వేసిందని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ కోసం గతంలో దరఖాస్తు చేసుకున్న 25 లక్షల మందిపై ఒక్కో దరఖాస్తుదారునిపై లక్ష రూపాయలు చొప్పున భారం వేసేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ తన నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు ప్రజలకు అండగా ఉండి పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల జడ్పీటీసీలు సంతోష్, ద్రుపదబాయి, అజయ్ కుమార్, ఎంపీపీ సౌందర్య, నాయకులు పాల్గొన్నారు.

రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల్లో రైతు భరోసా కార్యక్రమంలో భాగంగా రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంతో రైతులు వ్యవసాయ రంగంలో మెలకువలతో అధిక దిగుబడి వచ్చే పంటల గురించి తెలియజేడం జరుగుతుందని ఎంపీపీ చునార్కర్ సువర్ణ అన్నారు. బుధవారం మండలంలోని రైతువేదిక భవనంలో రైతు నేస్తం కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాగుకు తీసుకోవాల్సిన మెలకువల గురించి వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నేస్తం ద్వారా రైతులకు, ప్రభుత్వ అధికారులకు అనుసంధానం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం హర్షనీయమని, రైతులు సాగు కాలంలో వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అధిక దిగుబడి వచ్చే పంటలను మాత్రమే వేసుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ మనోహర్, ఏఓ మధులత, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి వేట... వలసబాట

- పనుల కోసం ఇతర ప్రాంతాలకు పర్సువాడ గ్రామస్తులు
- పట్టించుకోని యంత్రాంగం

ఉన్న ఊరిలో ఉపాధి కరువైంది. ఉపాధిని వెతుక్కుంటూ ఉరుకాని ఉరికి వలస బాట పడుతున్నారు. పంటలు పండక దిక్కుతోచని స్థితిలో కుటుంబ పోషణ కోసం గ్రామాలను వదిలి వెళ్లడం తప్పడం లేదు. ప్రభుత్వాలు ఎంతో అట్టహాసంగా అమలు చేస్తోన్న ఉపాధి హామీ పథకం అక్కడి గిరిజనులకు ఆసరా అందించలేకపోయింది. ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వాల హామీ వారికి అన్నం పెట్టడం లేదు. వ్యవసాయం తప్ప మరేమీ తెలియని నిరుపేదలు తల్లిలాంటి ఊరు, పిల్లాపాపలను వెంట బెట్టుకొని, పొట్టచేత బట్టుకుని పొరుగు జిల్లాలకు తరలివెళ్తున్నారు. అదే కోవకు చెందినది కుమురం భీం జిల్లా కెరమెరి మండలం సాంగ్వి గ్రామ పంచాయతీ పరిధిలోని పర్సువాడ గ్రామం.



పర్సువాడ గ్రామం ఇదే

నవతెలంగాణ కెరమెరి

స్వాతంత్ర్యం వచ్చి 75 దశాబ్దాలు గడుస్తున్నా నేటికి మారుమూల గ్రామాల రూపురేఖలు మారడం లేదు. పాలకులు మారిన ప్రభుత్వాలు మారినా ఆ గ్రామ తలరాతలు మారడం లేదు. గ్రామం ఏర్పడి సుమారు యాభై ఏండ్లు పూర్తి కావస్తోంది. అభివృద్ధి మాత్రం కానరాదు. గ్రామంలో 35 బంజారా గిరిజన తెగకు చెందిన కుటుంబాలు, 195 మంది జనాభా నివసిస్తున్నారు. అందరూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కొండ ప్రాంతం కావడంతో వర్షాధారిత పంటలు పండిస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. ప్రతి ఏటా పంటలు సరిగా పండక చేసిన అప్పులు కూడా తీర్చలేని దుస్థితి ఏర్పడుతుంది. జూన్ మొదలు జనవరి వరకు వ్యవసాయ పనులు ఉండడంతో కుటుంబ పోషణకు ఇబ్బంది ఉండకపోగా, ఫిబ్రవరి నుండి 4 నెలల పాటు ఎలాంటి ఉపాధి పనులు లేకపోవడంతో గ్రామస్తులకు వలస బాట తప్పడం లేదు. దీంతో పది కుటుంబాలు వరంగల్, ఖమ్మం జిల్లాలకు తరలి వెళ్లారు. వీరు తిరిగి ఖరీఫ్ నాటికి స్వగ్రామాలకు చేరుకుంటారు. పదుల సంఖ్యలో ఇండ్లకు తాళాలు పడడంతో గ్రామమంత బోసిపోయింది. ఇలాగే మండలంలోని పరందోలి, కోట, ముకుద్దం గూడ, లెండి గూడ, బోలపటార్‌తో పాటు పలు సరిహద్దు గ్రామాల ప్రజలు పత్తి తీసేందుకు నవంబర్ నుండి మార్చి వరకు ఇతర జిల్లాలకు తరలి వెళ్తారు. ఈ గ్రామానికి చెందిన కుటుంబాలు సదుపాయాలు లేని కారణంగా ఖైర్‌గూడ, అనార్ పల్లి, కోసార గ్రామాలకు శాశ్వతంగా వెళ్లిపోయారు.

అదుకొని ప్రభుత్వం

వలసల నివారణ లక్ష్యంగా అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం వలస జీవులను ఆదుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షేత్ర స్థాయిలో ఉపాధి అవసరమైన వారిని గుర్తించి పనుల కల్పనలో నిర్లక్ష్యం వలస గ్రామాలకు శాపంగా మారింది. వలసలు గల గ్రామాలను గుర్తించి గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామ సభలు కూడా నిర్వహించడం లేదని ఆరోపణలున్నాయి.

కర్ర, పెంకుటిళ్లలోనే నివాసం

గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ఏండ్లుగా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదు. గత ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు కునోచుకోలేదు. ఇందిరమ్మ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నేటికి మంజూరు కాలేదు. దీంతో గ్రామస్తులు నేటికి కర్ర, పెంకుటిళ్లలోనే జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పాఠశాల భవనం లేక విద్యార్థులు షెడ్డులోనే చదువు కోవాల్సిన దుస్థితి నెలకొంది.



పర్సువాడలో కర్ర, పెంకుటిళ్లు



పర్సువాడకు వెళ్లే దారి

ఉపాధి పనుల కోసం సంప్రదించలేదు

మల్లయ్య, ఈజీఎస్ ఏపీఓ



ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన లబ్ధిదారులకు 100రోజుల పని కల్పిస్తున్నాం. పర్సువాడ గ్రామస్తులు పనుల కోసం ఎవరు సంప్రదించలేదు. పనుల కోసం ఇతర జిల్లాలకు వెళ్లిన విషయం మా దృష్టికి రాలేదు. గ్రామాన్ని సందర్శించి పూర్తి వివరాలు సేకరిస్తాం.

కుటుంబ పోషణకే వలస

జలపతి, పర్సువాడ గ్రామం



చేన్లలో పత్తి తీసే పనులు కూడా లేవు. గ్రామం ఎత్తైన గుట్టలపై ఉండడంతో ఇతర పనులు చేయడానికి కూడా అవకాశాలు లేవు. కేవలం వ్యవసాయ పనులు తప్పితే ఏ పని దొరకదు. వేరే జిల్లాలో మిరపకాయలు తెంపే పని దొరుకుతుంది. ఎంతో కొంత సంపాదించాలని గ్రామం నుంచి వెళ్లిపోతున్నారు.

పది రోజులే సమయం..!

- కష్టపడి చదివితే గెలుపు ఖాయం
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక
- ప్రత్యేక దృష్టిసారించిన ఉపాధ్యాయులు

విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టుగా భావించే పదో తరగతి వార్షిక పరీక్షలకు సమయం దగ్గరపడింది. పరీక్షలు ప్రారంభం కావడానికి మరో పది రోజులే మిగిలి ఉన్నాయి. ఈనెల 18నుండి మార్చి చివరి వరకు జరగనున్న ఈ పరీక్షల కోసం విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. మూడు నెలల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సంసిద్ధులు చేస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. కష్టపడి చదివితే గెలుపు సులువుగా మారుతుందని.. వందశాతం ఫలితాలతో పాటు ఉత్తమ మార్కులు సాధించవచ్చని తర్ఫీదునిస్తున్నారు.

నవతెలంగాణ- కెరమెరి

పదో తరగతిలో వెనుకబడ్డ విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహించి రివిజన్ పూర్తి చేయగా.. 100 శాతం ఉత్తీర్ణతకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తూ ముందుకు సాగుతున్నారు. గత విద్యా సంవత్సరంలో వెల్లడైన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గడంతో ఈ ఏడాది ఏలాగైన ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులను ఆశ్రమ పాఠశాలల సిబ్బంది సంసిద్ధం చేస్తున్నారు.

ప్రత్యేక తరగతులు..!

ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 9వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. ఉదయం 8.30గంటల నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.45 నుంచి 5.45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.ఉదయం, రాత్రి పూట స్టడీ ఆవర్స్ ఏర్పాటు చేస్తున్నారు. రోజుకో సబ్జెక్టులో ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం మెరుగైన ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ప్రాజెక్ట్ వర్క్, రోజూ వారీ టెస్టులు నిర్వహిస్తున్నారు. జనవరిలో సబ్జెక్టుల వారీగా గ్రాండ్ టెస్టులు, స్లిప్ టెస్టులు నిర్వహించారు. ప్రస్తుతం ప్రీ ఫైనల్ పరీక్షలు జరుగుతున్నాయి.మరో పది రోజుల్లో వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా వారికి ఎప్పటికప్పుడు మనోధైర్యాన్ని కల్పిస్తున్నారు. మండలంలో మూడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, 3 బాలుర ఆశ్రమ, ఒక బాలికల ఆశ్రమ, కేజీబీవీ పాఠశాలలు ఉండగా,సుమారు మొత్తం 310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

- స్వర్ణలత, పీజీహెచ్‌ఎం, బాలికల ఆశ్రమ పాఠశాల, మోడీ



గత నెల 9వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. వందశాతం ఫలితాలు సాధించే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. సబ్జెక్టుల వారీగా అనుమానాలను నివృత్తి చేసుకుంటూ ముందుకెళ్తున్నాం. సిలబస్ ప్రకారం బోధన పూర్తి చేశాం. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నాం.



రాత్రి సమయంలో స్టడీ అవర్స్‌ను పరిశీలిస్తున్న పీజీహెచ్‌ఎం స్వర్ణలత

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలలో జిల్లాను రాష్ట్రంలో ముందంజలో ఉంచే విధంగా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం 10వ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 18 నుండి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఇందుకుగాను జిల్లాలో 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 6,595 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, పరీక్షల నిర్వహణ కోసం 37 మంది వివిధ శాఖల అధికారులతో ఫ్లయింగ్ స్క్వాడ్, మొబైల్స్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా స్వేచ్ఛ వాతావరణంలో పరీక్షలు రాసే విధంగా ఇన్విజిలేటర్లు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేతతో పాటు పోలీసు బందోబస్తు, 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్స్ నిషేధం ఉంటుందన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విధంగా ఆర్టీసీ అధికారులు ప్రణాళికాబద్ధంగా బస్సులు నడిపించాలని ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల నిమిత్తం పరీక్షా కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక చికిత్స కిట్లతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుతూ వైద్య సిబ్బందిని నియమించాలన్నారు. కేంద్రాలకు విద్యుత్తు సరఫరా లోపం లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీరు, మూత్రశాలలు, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సీసీ కెమెరా ఏర్పాటు చేయాలని, చీఫ్ ఇన్విజిలేటర్లు ఒక రోజు ముందుగా ఇన్విజిలేటర్లకు సూచనలు అందించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరీక్ష ఏర్పాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా సాగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీఓ లోకేశ్వర్ రావు, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం భట్, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా బొమ్మల కొలువు

- బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు కార్యక్రమం బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. దీనికి బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన మంచె, వెదరు బొంగుల గుడిసెలు తదితర వస్తువులను మహిళలు తయారు చేసిన బొమ్మలను ఆయన తిలకించారు. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా బొమ్మల కొలువులో రూపాలను ఏర్పాటు చేశారని కొనియాడారు. అయోధ్య మందిరం, శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి గంగాపూర్ మందిర నమూనాను ప్రదర్శించారు. అనంతరం లేడిస్ క్లబ్ సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు, ర్యాంప్ వాక్ అలరించాయి. ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అతిథులుగా హాజరైన లలిత గుప్తా, సూర్యలక్ష్మి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, ఏజీఎం తిరుమలరావు, ఉమాకాంత్, సేవా సమితి ఉపాధ్యక్షురాలు నలిని, లేడిస్ క్లబ్ కార్యదర్శి మంజుల, సభ్యులు అరుణ, లీలా, సౌమ్య పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా కాంగ్రెస్ కార్యకర్తలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన అకిరెడ్డి సంతోష్‌కు హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి పోవడంతో ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆదేశాలతో మండల కార్యకర్తలు రూ.6వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోమురం కనకయ్య, ఉపాధ్యక్షుడు జునుగరి శేఖర్, ప్రధాన కార్యదర్శి కొండు శంకర్, ప్రచార కార్యదర్శి చాప్లే శ్రీనివాస్, నియోజకవర్గ కోఆర్డినేటర్ లోడెల్లి ప్రవీణ్, సలహాదారులు బోర్కుట్ వెంకయ్య, సహాయ కార్యదర్శి షాహిద్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శి, పోలాజి రాజన్న, రాపల్లి రామయ్య, కోసన వాగయ్య, మేకల జనార్ధన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | మార్చి 7, 2024 | www.navatelangana.com

సీఐ, ఎస్ఐలను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మందమర్రి



నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలీస్ అధికారులను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. మందమర్రి పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్, పట్టణ సబ్ ఇన్స్‌పెక్టర్ లుగా బాధ్యతలు స్వీకరించిన శశిధర్‌రెడ్డి, రాజశేఖర్‌లను బుధవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జె రవీందర్, మేడిపల్లి సంపత్, బత్తుల శ్రీను, అబ్బాస్, సూరిబాబు, రాంవేణు, బడికల సంపత్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని జెండా వెంకటపూర్ గ్రామంలో బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ రూ.5.25 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఎంపీపీ మంగ చిన్నన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పింగళి రమేష్, పంచాయతీ రాజ్ ఏఈ విక్రమ్ రెడ్డి, గ్రామ కార్యదర్శి పి.నరేందర్, గ్రామ అధ్యక్షుడు చిన్నయ్య, వేల్తపు భారతి, రామ్, సత్తయ్య, అత్తే రాజయ్య తిరుపతి, పెట్టం రామన్న, మల్లేష్, రామయ్య, కోన వేంకటేష్, తోంగల రాజన్న, బొజ్జు పటేల్ పాల్గొన్నారు.

ఎల్ఈడీ స్క్రీన్‌పై మోడీ నారీ శక్తి వందన్ అభియాన్



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని స్థానిక సూపర్ బజార్ చౌరస్తాలో నారీ శక్తి వందన్ అభియాన్ ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోడీ లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్ ఆధ్వర్యంలో, బీజేపీ పట్టణ అధ్యక్షుడు వేముల అశోక్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. నరేంద్ర మోడీ లైవ్ ద్వారా మహిళా సోదరీమణులను ఉద్దేశించి వారి అభివృద్ధి చేసిన సంక్షేమ పథకాల గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మహిళలు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కేంద్ర ఫిలిం బోర్డ్ సభ్యులు ఆర్మాల్ల పోషం, బీజేపీ చెన్నూరు నియోజకవర్గ నాయకులు దుర్గం అశోక్ మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డీవీ దీక్షితులు, మండల అధ్యక్షుడు రాజేందర్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మాస్ సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు జి కళిందర్ రెడ్డి, సీనియర్ నాయకులు దండు రాజేందర్, చప్పడి నరేష్, మేకల రమేష్, వైద్య శ్రీనివాస్, ముద్దసాని శ్రీనివాస్, బీజేవైఎం నాయకుడు సంతోష్ రామ్, ఓరిగడ్డి సాయి, బద్రి సతీష్, కుమ్మరి రాంకిషోర్, ఉరుసు నరసయ్య పాల్గొన్నారు.

20వ వార్డు అభివృద్ధి పనులను ప్రారంభించిన చైర్మన్



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు అభివృద్ధి పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి రూ.నాలుగు కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుబ్బారెడ్డి, నస్పూర్ టౌన్ అధ్యక్షుడు బండారి సుధాకర్, సింగిల్ విండో డైరెక్టర్ ధరణీ మధుకర్, మంచిర్యాల జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్ల సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికలను స్వేచ్ఛ వాతావరణంలో పెంచాలి

నవతెలంగాణ-తాండూర్

బాలికలను స్వేచ్ఛ వాతావరణంలో పెంచినప్పుడే వారు వారి సొంత నిర్ణయాలతో సమాజంలో గుర్తింపు పొందుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమతా అన్నారు. బుధవారం మండలంలోని కిష్టంపేట రైతు వేదికలో అంతర్జాతీయ మహిళ దినిత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మితిమీరిన కుటుంబ కట్టుబాట్ల వల్ల ఆడపిల్లలు వెనకబడి పోతున్నారన్నారని తెలిపారు. సమాజంలో ఆడ, మగ తేడాలను విడనాడి బాలికల పట్ల మంచి సద్భావం ఏర్పడేలా వ్యవహరించాలని తెలిపారు. అప్పుడే మహిళలపై అఘాయిత్యాలు తగ్గుతాయన్నారు. మహిళలు చట్టాలపై పూర్తి అవగాంహన పెంచుకోవలని తెలిపారు. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తెలిపారు. బాల్యవివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలపై అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాదారం సెక్టార్ అంగన్‌వాడీ టిచర్లు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ ఆన్‌లైన్ సబ్మిషన్ శిక్షణా తరగతులు

నవతెలంగాణ-నస్పూర్



సీఎంపీఎఫ్ ఆన్లైన్ సబ్మిషన్ శిక్షణ తరగతులను ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచౌరి హాజరై ఆన్‌లైన్‌లో సిఎంపీఫ్ ఏవిధంగా సబ్మిట్ చేయాలో కూలంకషంగా వివరించారు. దీని ద్వారా సీఎంపీఎఫ్ సెటిల్మెంట్లు త్వరగా చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సంబంధిత సిబ్బంది సీఎంపీఎఫ్‌కు సంబంధించిన అన్ని అంశాలను ఉద్యోగులు కూలంకషంగా నేర్చుకొని సంబంధించిన సెటిల్మెంట్లు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం వి.పురుషోత్తమరెడ్డి, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్య నిధికి దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-నస్పూర్

2024-25 విద్యా సంవత్సరానికి గాను ఉన్నత చదువుల కోసం అంబేద్కర్ ఓవర్సీస్ విద్య నిధి పథకానికి జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన, చివరి సంవత్సరం చదువుతున్న వారు ప్రభుత్వ ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని, ఉన్నత చదువులకు అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా తదితర దేశాలలో ఉన్నత చదువుల కొరకు అర్హత గల అభ్యర్థులు వెళ్ళవచ్చని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోగా జిల్లాలోని ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లో తెలంగాణఈపాస్.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రైతులతో సంబంధాలు పెంచుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్

నవతెలంగాణ-తాండూర్



రైతులు వ్యవసాయ అధికారులు ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నప్పుడే వ్యవసాయంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం బెల్లంపల్లి మండలం కన్నాల రైతు వేదికలో వీడియో కాన్ఫిరెన్స్ సేవలను ప్రారంభించారు 'రైతునేస్తం' పేరిట సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవ సాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం సచివాలయం నుంచి ప్రారంభించిన కార్యక్రమాన్ని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ రైతులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలు ఉండగా 'రియల్ టైమ్ సొల్యూషన్ త్రూ డిజిటల్ ప్లాట్ ఫాం' ప్రాజెక్టు కింద ప్రయోగాత్మకంగా మొదటి విడత 110 కేంద్రాల్లో ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. వచ్చే ఉగాది నాటికి మిగిలిన అన్ని రైతువేదికల్లో ఈ వ్యవస్థను అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు, రైతుల మధ్య ప్రత్యక్ష, పరస్పర విషయ మార్పిడికి జూమ్, యూట్యూబ్ లైవ్ ద్వారా రైతువేదికలకు లింక్ చేస్తాయని వివరించారు. శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులతో క్షేత్రస్థాయి సమస్యలపై ముఖాముఖిగా చర్చించడం ద్వారా రైతులకు విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాండూరు మండల వ్యవసాయ అధికారి కిరణమ్మ, కన్నాల ఏఈఓ నాగ దీప్తి హార్టికల్చర్ ఆఫీసర్ సుప్రజ కాంగ్రెస్ నాయకులు నాతారి స్వామి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్‌లోని రైతు వేదికలో ఆన్‌లైన్ వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులు ప్రారంభించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు సమస్యలు పరిష్కారం అవుతాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు పంటలకు సంబంధించి శాస్త్రవేత్తల ద్వారా సలహాలు సూచనలు, ఆన్‌లైన్ శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఏఓ జి.కల్పన, వ్యవసాయ అధికారి చల్ల ప్రభాకర్, జడ్పీటీసీ ముత్తె సత్తయ్య, ఎంపీపీ అన్నం మంగ, లక్షెటిపేట మండల అధ్యక్షులు పింగిలి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఆరిఫ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది

- డీఆర్‌డీఓ కిషన్

నవతెలంగాణ-నస్పూర్



ప్రజాస్వామ్యంలో సమ సమాజ స్థాపనకు కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని స్వీప్, నోడల్ అధికారి, డీఆర్‌డీఓ కిషన్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో అంతర్జాతీయ సెక్స్ వర్కర్ల హక్కుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కె.చిన్నయ్య, జిల్లా వయోజన విద్య అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ వచ్చే లోక్ సభ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించుకోవాలని తెలిపారు. సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్



ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి పునాది లాంటిందని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా నిర్భయంగా, నిస్పక్షపాతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని, డాబీఆర్ అంబేద్కర్ లాంటి మహనీయులు ఎలాంటి తారతమ్యాలు లేకుండా దేశంలోని అందరికీ ఓటు హక్కును కల్పించడంలో ఎంతో కృషి చేశారని అన్నారు. మెరుగైన సమాజం, ప్రజాస్వామ్యం ఆదర్శవంతమైన రాజకీయ నాయకులను ఓటు ద్వారా ఎన్నుకున్నప్పుడే సాధ్యమవుతుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకుని, ఇతరులకు కూడా ఓటు విలువను తెలియజేయాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కుల, మత, ప్రాంత, వర్గ తదితర ప్రతిపాదికన దుర్వినియోగం చేయకుండా మంచి నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఓటు హక్కు ఆవశ్యకత, ప్రాధాన్యతను తల్లిదండ్రులకు, ఇతరులకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ సిద్దయ్య, స్నేహ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డి.శ్రీనివాస్, జిల్లా వైద్య-ఆరోగ్య శాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, నీలిమ, వెంకటేశ్వర్, స్వీప్ సమన్వయకర్తలు రాంచందర్, కుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలో ప్రభుత్వ మోడల్ డిగ్రీ విద్యార్థులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



తెలంగాణ ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు లక్షెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ హ్యూమానిటీస్ ఆధ్వర్యంలో మంగళవారం బీఏ విద్యార్థులు బుధవారం విజ్ఞాన యాత్రకు వెల్లారు. హైదరాబాద్‌లో క్షేత్ర పర్యటనలో పలు ప్రదేశాలను సందర్శించారు. దీనిలో భాగంగా బీఏ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులను హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, సాలర్ జంగ్ మ్యూజియం, రాష్ట్ర శాసనసభ, రాష్ట్ర సచివాలయం లాంటి విజ్ఞాన స్థలాలను సందర్శించారు. కళాశాల చరిత్ర అధ్యాపకులు ఎస్ శ్రీనివాస్, ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు ఎన్ రామచంద్రం, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కే.సంధ్యారాణిలు ఉస్మానియా యూనివర్సిటీలో ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ అర్జున్‌రావు, బోర్డు ఆఫ్ స్టడీస్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ దేశాయ్‌ల సహకారంతో విద్యార్థులకు పలు విషయాల పట్ల యూనివర్సిటీలో అవగాహన కల్పించారు. అంతేకాకుండా చారిత్రక ప్రదేశాల ప్రాముఖ్యత, వాటి విశేషాలు, అసెంబ్లీ నిర్వహణ, రాజకీయ ముఖ చిత్రం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పర్యటనలో అధ్యాపకులు శ్రీనివాస్, రామచంద్రం, సంధ్య రాణితో పాటు సుమారు 20 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల రాస్తారోకో



నవతెలంగాణ-తాండూర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడం లేదని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం అన్నారు. బుధవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి తాండూర్ ఐబీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులువెంటనే చెల్లించాలన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26,000లు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన నిర్వహణను స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అన్ని రకాల ఆహార వస్తువులపై జీఎస్టీని ఉపసంహరించాలన్నారు. పాఠశాలల్లో వంట షెడ్లు, వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి మల్లక్క, బొల్లి సరోజ, దేవ శారద, అన్న అక్క, శంకరమ్మ, రాజు భాయి, హనుమక్క, వరలక్ష్మి, సత్య అక్క, రాధా, మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియా సివిల్ ఫిట్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా సివిల్ డిపార్ట్మెంట్ ఏఐటీయూసీ నూతన ఫిట్ కమిటీని బుధవారం శ్రీరాంపూర్ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ డిప్యూటీ సెక్రటరీ మోత్కూరు కొమురయ్య ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జీఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ రామచంద్ర, శ్రీరాంపూర్ సివిల్ డిపార్ట్మెంట్ ఫిట్ సెక్రటరీ నాగేశ్వరావు, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ మల్లేష్, సదానందం, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సందీప్, కోశాధికారిగా ఆర్.లచ్చయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్ఏ ఖాన్, రాజేష్ బాబు, ఎస్ నర్సింగరావు, గంగారాం, రాంబాబు, అశోక్, ఎం సందీప్, ఎం రాజేందర్, చీఫ్ అడ్వైజర్‌గా నూకల రాజయ్యలు ఎన్నికయ్యారు.

వేలాల జాతరకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ యాదవ్



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని వేలాల మల్లన్న జాతరకు తరలి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్ యాదవ్ అన్నారు. బుధవారం వేలాల గ్రామాన్ని సంధర్శించిన ఆయన గుట్టపై వెల్సిన గట్టుమల్లన్నను దర్శించుకున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ మహా పుణ్య క్షేత్రమైన వేలాల మల్లన్న దర్శనార్థం తరలివచ్చే భక్తులకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా తాగు నీటి వసతి, వాహణాల పార్కింగ్, గోదావరి పుష్కరఘాట్ వద్ద సమస్యలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. భక్తుల అవసరాల మేరకు సౌకర్యాలు కల్పించడంతో పాటు భక్తుల ఇబ్బందుల పట్ల శాఖ పరంగా అందుబాటులో పరిష్కారం చూపించాలని సూచించారు. వేలాల గ్రామానికి వచ్చిన డీసీపీ అశోక్ కుమార్‌ను గ్రామ పంచాయతి మాజీ ఉప సర్పంచ్ డేగ నాగేష్, కాంగ్రెస్ నాయకులు ప్యాగ లక్ష్మన్ ఆలయ ట్రస్ట్ సభ్యులు శ్రీకాంత్ శాలువాతో సన్మానించారు.

ఎలాంటి పొరపాట్లు లేకుండా దరఖాస్తులు స్వీకరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్



నవతెలంగాణ-నస్పూర్

ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్ పురపాలక సంఘ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మున్సిపల్ కమీషనర్ సీహెచ్ సతీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమంలో అభ్యర్థుల నుండి స్వీకరించిన దరఖాస్తుల వివరాలను ప్రతి రోజు ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ చాంబర్‌లో ఇంటి పన్నుల వసూలు వివరాలను పరిశీలించి మార్చి 31వ తేదీ లోగా ఇంటి పన్నులను 100 శాతం వసూలు చేయడంతో పాటు ట్రేడ్ లైసెన్సులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

- సీపీఐ(ఎం)జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు



నవతెలంగాణ-జైపూర్

ఈ నెల 12న సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో భీమారం సమీపంలో గల జోడు వాగుపై వంతెన నిర్మిచాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని జిల్లా కమిటి సభ్యులు బోడంకి చందు పిలుపునిచ్చారు. బుధవారం చెన్నూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన జరల్ బాడీ సమవేశంలో ప్రజా సమస్యలపై కార్యాచరణ, పరిష్కారం కోసం చర్చించుకున్నారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో ప్రజలు తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ రహదారి 363లో జోడు వాగు వంతెన నిర్మాణం, ఇరువైపుల చెడిపోయిన రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోవడం లేదని అన్నారు. తక్షణమే జోడు వాగు వంతెన నిర్మాణంతో పాటు ఇరువైపుల గల రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు రవి, ఉమారాణి, నాగజ్యోతి, సమ్మక్క, సరిత, యామిని, బూదక్క, చంద్రన్న, నగేష్, రాజేశ్వరి, లక్ష్మి, జమున, రాములు పాల్గొన్నారు.

గృహజ్యోతి, గృహలక్ష్మీ పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జన్నారం

గృహజ్యోతి, గృహలక్ష్మి పథకాలకు సంబంధించిన దరఖాస్తులను బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శశికళ స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలనలో గ్రామాల్లో తీసుకున్న దరఖాస్తులలో తప్పులు దొర్లితే సరి చేయడానికి ఈ దరఖాస్తులను తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులో ఎలాంటి తప్పులు ఉన్న, వెంటనే ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మళ్లీ దరఖాస్తు ఫారాలను అందించాలన్నారు. వాటిని సరిచేసి లబ్ధిదారులకు మేలు చేకూరుస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
గురువారం | మార్చి 7, 2024 | www.navatelangana.com

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

• ఇద్దరికి గాయాలు

నేరడిగొండ : మండలంలోని బోరిగామ క్రాస్ రోడ్డు వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోథ్ మండలం నిగిని గ్రామానికి చెందిన జాదవ్ వినోద్(33), రాథోడ్ ఉద్దేశ్, రాథోడ్ ప్రదీప్ కలిసి రాథోడ్ ఉద్దేశ్‌కు చెందిన మోటార్ సైకిల్‌పై బోరిగామాకు చెందిన రాథోడ్ సంతోష్ కూతురి పెండ్లికి ఇంటి నుండి బయలుదేరారు. మోటార్ సైకిల్‌ను రాథోడ్ ఉద్దేశ్ నడుపుతుండగా వెనకాల రాథోడ్ ప్రదీప్, జాదవ్ వినోద్ కూర్చున్నారు. ఎన్‌హెచ్ 44 రోడ్డు గుండా వెళుతూ బోరిగామ క్రాసింగ్ దగ్గర ఉద్దేశ్ మోటార్‌సైకిల్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ అదుపుతప్పి ఎడమ వైపు డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో జాదవ్ వినోద్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. తలతో పాటు ఇతర చోట్ల బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాథోడ్ ఉద్దేశ్, ప్రదీప్‌కూ తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మారుతి తెలిపారు.

డీజే సౌండ్లకు పోలీసుల ఆంక్షలు

నవతెలంగాణ-మందమర్రి



డీజే సౌండ్లకు మందమర్రి పోలీసులు ఆంక్షలు విధించారు. బుధవారం పట్టణంలోని డీజే సౌండ్ యజమానులతో సీఐ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ సమావేశం ఏర్పాటు చేసారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమతి లేకుండా డీజే సౌండ్స్ నిర్వహించిన వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పెళ్లిలకు రాత్రి 10 గంటలలోపే డీజే సౌండ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలుంటాయని స్పష్టం చేశారు.

మహిళా దినోత్సవం సందర్భంగా సాంస్కృతిక పోటీలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు కళాశాలలోని మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో "సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర" అనే అంశంపై వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ డి. లక్ష్మీనరసింహం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారత విభాగం ఇన్‌చార్జి ఆర్.కృష్ణవేణి, అధ్యాపకులు శారద, రోజ్ మేరీ, కవిత, శాంభవి, సానియా, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యం కల్పిస్తాం

నవతెలంగాణ-వాంకిడి

బ్యాంకు ద్వారా ఖాతాదారులకు అందిస్తున్న బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ మందకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మొకాసిగూడ గ్రామానికి చెందిన కొట్నాకె రఘునాథ్ మృతిచెందగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం క్రింద రూ.రెండు లక్షలు మంజూరు కాగా చెక్కును ఎస్‌బీఐ మేనేజర్ మృతుడి భార్య కొట్నాకె పోచుబాయికి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వివేక్, ఎస్‌బీఐ నిర్వాహకులు భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాగ్రి పంపిణీ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని ఆరెగూడ, కడంబా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రావణిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్, ప్లాంటేషన్ డిప్యూటీ మేనేజర్ రాకేష్, ఉపాధ్యాయులు రవిశంకర్, రమేష్, రాజేశం, అనిత, నీలిమ, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలిక సాధికారత కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఏఎస్ఐ సురేందర్ పాల్గొని మాట్లాడుతూ నేటి విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలు, మహిళలు సామాజిక అవగాహనతో పాటు చట్టంలోని కొన్ని సెక్షన్లు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదివితేనే భవిష్యత్తులో కుటుంబం బాగుపడుతుందన్నారు. యువతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇబ్బందులు ఎదురైనప్పుడు డయల్ 100కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.వెంకట్‌రావు, ఉపాధ్యాయులు సుమలత, లలిత, వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్ర కుమార్, రాజేందర్, స్వప్న, అంబాజి, రాధిక పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశ గడువు పొడిగింపు

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి, ఏడు నుంచి పదవ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్ల ప్రవేశానికి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు మార్చి 11 వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ. 125, ఓపెన్ క్యాటగిరి విద్యార్థులకు రూ.200 ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని విద్యార్థిని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

మహిళల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి

• కలెక్టర్ వెంకటేష్ దోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవలక్ష్మి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలలో సహజంగా ఉండే ఓర్పు, సహనంతో కుటుంబాన్ని తీర్చిదిద్దడంతో పాటు సమాజంలోని అన్ని రంగాలలో రాణించి దేశ అభివృద్ధికి పాటు పడాలన్నారు. సంస్కారం కలిగిన భావితరాలను అందించడంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు. దేశ జీడీపీ అభివృద్ధిలో ప్రతిరోజు మహిళలదే పైచేయి ఉంటుందని, సమాజ సేవలో ముందుండడం సంతోషంగా ఉందన్నారు. మహిళలతోనే సృష్టి మనుగడ జరుగుతుందని, వివక్షత లేకుండా అన్ని రంగాలలో వారిని ప్రోత్సహించాలన్నారు. మహిళలకు ఆత్మస్థైర్యమే గొప్ప ఆయుధమని, వారికి సముచిత స్థానం కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉన్నత పదవులలో రాణిస్తారని అన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక భద్రతా చర్యలు చేపడుతుందని తెలిపారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ మహిళలు క్రీడలు, ఉద్యోగాలు లాంటి ప్రతి రంగంలో ముందుండాలని, జాతీయ స్థాయిలో క్రీడారంగంలో నిర్వహించే పోటీలలో పాల్గొని దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, ఆరోగ్య కార్యకర్తల నుండి జిల్లా స్థాయి అధికారుల వరకు అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని, స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో అన్ని రంగాలలో తమదైన గుర్తింపుతో రాణించాలని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవలక్ష్మీ మాట్లాడుతూ మహిళలు ప్రతి ఒక్కరు చదువు, ఉద్యోగం, రాజకీయం, సామాజికంగా అన్ని రంగాలలో రాణించాలని, పిల్లలకు నైతిక విలువలు కలిగిన విద్యను అందించి వారిని ఉన్నత స్థానాలకు ఎదిగే విధంగా ప్రోత్సహించాలని అన్నారు. ఐటీడీఏ మహిళ అధికారులు, ఉద్యోగులు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు జిల్లా కలెక్టర్, ఆసిఫాబాద్ శాసనసభ్యులతో కలిసి సన్మానించారు. అనంతరం రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఖచ్చితంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని అందరితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మహిళలు

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నెలనెలకు వేల జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ పాఠశాల విధులకు డుమ్మా కొడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్) రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి వేల రూపాయలు జీతాలు తీసుకుంటూ విధులకు సక్రమంగా హాజరు కాకుండా తమ సొంత వ్యాపారాలు, పనులకు ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. గిరిజన విద్యార్థుల చదువులకు అన్యాయం చేస్తూ పాఠశాలలకు డుమ్మా కొడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాల్సిన విద్యాశాఖ అధికారులు వారి నుండి మామూళ్లు వసూలు చేస్తూ చర్యలు తీసుకోకుండా మినమేషాలు వేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతు నేస్తం వీసీలో పాల్గొన్న కలెక్టర్



నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని నాయకులు, రైతులతో కలిసి వీక్షించారు. అనంతరం మార్కెట్ యార్డులో సోయ కొనుగోలు కేంద్రాన్ని పరీక్షించారు. పంట వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మధ్యాహ్న భోజనం సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజ రెడ్డి, ఎంపీపీ గోవర్ధన్, పీఏసీఎస్ చైర్మెన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి, నాయకులు రాకేష్ రెడ్డి, అధికారులు పుల్లయ్య, ఏఓ వివేక్, ఎంపీడీఓ ఏ.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

బీజేపీ ఆర్గనైజింగ్ కార్యదర్శిని కలిసిన ఎంపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ జాతీయ ఆర్గనైజింగ్ కార్యదర్శి బీఎల్ సంతోష్ కుమార్‌ను పార్లమెంటు సభ్యులు సోయం బాపూరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బీజేపీ తొలి జాబితాలో తనకు టికెట్టు లభించకపోవడం తదితర పరిణామాలను సంతోష్ వివరించారు. పార్టీ టికెట్ల కేటాయింపులో చర్చలు జరుగుతున్నాయని సానుకూలంగా ఉన్నట్టు సంతోష్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాలో ఓటు బ్యాంకు పరిస్థితిలు, బీజేపీకి పెరిగిన ఆదరణ గురించి ఆయనకు వివరించారు.

ఎంపీ సీటు కోసమే బీఆర్ఎస్‌తో పొత్తు

నవతెలంగాణ-సిర్పూర్(టి)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుకారాం

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప ఓటమి చెందడానికి ప్రధాన కారణం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ అని, ప్రస్తుతం నాగర్‌కర్నూల్‌లో పార్లమెంటు ఎన్నికల్లో ఎంపీ సీటు దక్కించుకోవాలని బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుకారాం అన్నారు. బుధవారం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పను ఓడించడానికి బీజేపీ పార్టీలో పొత్తు పెట్టుకొని కోనప్పను ఓడించారని ఆరోపించారు. నాడు బీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును ఎన్నికల సమయంలో ఆయనపై తీవ్ర విమర్శలు చేసిన వ్యక్తి అధికార దాహానికి బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇలాంటి వ్యక్తులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఎలాంటి నిర్ణయం తీసుకున్న ఆయన మాటకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ, కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, వెంకట్‌రావ్‌పేట్ మాజీ ఉప సర్పంచ్ దౌలత్, మాజీ ఎంపీటీసీ దుర్గం విక్రమ్, రాందాస్, వార్డు సభ్యులు ఇఫ్తత్ హుస్సేన్, నాయకులు పాల్గొన్నారు.

ముత్యంపల్లిలో పర్యటించిన అధికారులు



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు పర్యటించారు. పలు వార్డులు తిరుగుతూ చేపట్టనున్న అభివృద్ధి పనులను గుర్తించి పర్యవేక్షించిన ప్రత్యేక అధికారి తహసీల్దార్ భోజన్న, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్, కాంగ్రెస్ యువ నాయకులు, యాదవ సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడు పుర్ర కుమారస్వామి యాదవ్, మండల కోఆప్షన్ సిరాజ్ ఖాన్, మైదం రమేష్, మాజీ వార్డ్ మెంబర్ మంద వెంకటేష్, కాంగ్రెస్ గ్రామ ప్రధాన కార్యదర్శి రేషవేణి ఓదెలు, విలేజ్ యూత్ ప్రెసిడెంట్ మారం రాజ్‌కుమార్, బీసీ సెల్ అధ్యక్షులు రేషవేనీ స్వామి, పంబాల అరవింద్, బాకీ నరేష్, పోలవేణి పోషన్న, బోయిని సాయి కుమార్, రంజిత్ కుమార్, షారుక్ పాల్గొన్నారు.

జీరో కరెంట్ బిల్లు అందించిన జడ్పీటీసీ



నవతెలంగాణ-తలమడుగు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా బుధవారం సకినాపూర్ గ్రామంలో గృహ జ్యోతి పథకం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంలో జీరో బిల్లును జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరు గ్యారెంటీ పథకాలను అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్నిదేని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, మాజీ సర్పంచ్ మారుతి, ఏఈ సతీష్ కుమార్, సబ్ ఇంజినీర్ సాయి, లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ లైన్‌మెన్ గంగయ్య, మాజీ సర్పంచ్ పునాజీ, కాంగ్రెస్ నాయకులు రమేష్ రెడ్డి, వెంకన్న యాదవ్, పోశెట్టి, మాధవరావు, సుదర్శన్, జ్యోతిరామ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

• ఎంపీపీ మల్లికార్జున్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న వేసవిలో మండలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీపీ మల్లికార్జున్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. దీనికోసం అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. తన ఎంపీటీసీ పరిధిలో పలు గ్రామాలకు భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని గుండి ఎంపీటీసీ మల్లేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. గోవిందపూర్ గ్రామపంచాయతీ ప్రజలు గుండి గ్రామానికి వెళ్లి రేషన్ సరుకు తీసుకురావాల్సి వస్తుందని గోవిందపూర్‌లో కొత్త రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, అదే గ్రామంలో మన ఊరు మనబడి పనులు అసంపూర్తిగా ఉన్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. సభ సందర్భంగా ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓఉమర్ హుస్సేన్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన గజేందర్



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని బోరుగామ క్రాస్ రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన నిగిని గ్రామానికి చెందిన జాదవ్ వినోద్ కుటుంబాన్ని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే. గజేందర్ పరామర్శించారు. బోథ్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని చూసి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఆయన వెంట బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు సాయన్న, అబ్బద్, చంటి, మహమ్మద్ ఉన్నారు.